క్లుప్తంగా

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

శంకరపట్నం: మండలంలో ఇటీవల మృతిచెందినవారి కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ట్యాంకర్ బోల్తాపడి మృతిచెందిన తాడికల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ ,బస్వయ్య ,సంపత్ ,రాజయ్య ఉన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు



నేరెళ్ల లక్ష్మి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల లక్ష్మి రెండు రోజులుగా కనిపించడం లేదని కుటుంబ సభ్యులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరక మిస్సింగ్ కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

స్నేహితుల ఆర్థికసాయం



నగదు అందిస్తున్న మిత్రులు

శంకరపట్నం: ట్యాంకర్ బోల్తాపడి మృతి చెందిన మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన పూదరి శ్రీనివాస్ కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. గ్రామానికి చెందిన రాజు, శ్రీనివాస్, సంపత్,రవీందర్, రమేశ్,అనిల్ బుధవారం రూ.35 వేలు అందజేశారు.

చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దంపతులు

చొప్పదండి: మండలంలోని రాగంపేటలో సామాజిక సేవకుడు నలుమాచు మనోహర్, రాధ దంపతులు వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని బుధవారం నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సింగిరెడ్డి క్రిష్ణారెడ్డి, బొల్లం సరోజన, బైరి వెంకటసాయి, ఎలిగేటి మల్లేశం, దండె వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం సామాజికవేత్త భాగ్యరెడ్డివర్మ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సమాజానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాక సతీశ్, సొల్లు బాబు కొలిపాక సమ్మయ్య, రామగిరి అంకుశ్, ఏలేటి రవీందర్, సిరిపాటి వేణు, బత్తుల మనోజ్ పుష్పలత, నర్సింగం, పసుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

పొలం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



పొలంలో మధ్యలో మట్టి కుప్పలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపురం గ్రామానికి చెందిన కౌరు లింగారెడ్డి తన కూతురు వ్యవసాయ భూమిలో వరినాటు వేయగా రోడ్డు నిర్మాణ మట్టి పొలంలో పోశారని బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పొలం పక్కనే జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయని, తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నాటువేసిన భూమిలో అర్ధరాత్రి జాతీయ రహదారి నిర్మాణం కోసం టిప్పర్లతో మట్టిపోసి పొలాన్ని ధ్వంసం చేశారని, న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



రామడుగు: కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



తాపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో...



మానకొండూర్: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నృసింహ జయంతి సందర్భంగా బుధవారం స్వామివారి కల్యాణం వేదపండితుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్ర త్యేక పూజలు, అభిషేకాలు, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, హనుమాన్ స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్ రావు సరోజన, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ కవిత తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ, ఎల్ఎండీ కాలనీలోని శ్రీలక్ష్మీనసింహస్వామి ఆలయాల్లో స్వామివారి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తాపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి భక్తులకు అన్నిరకాల ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం అనంతరం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నల్లగొండ ఆలయ ప్రధాన అర్చకులు, నల్లగొండ ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణ్, కమిటీ సభ్యులు, ఎల్ఎండీ ఆలయ ప్రధాన అర్చకులు తిరునగిరి వెంకటాద్రి, ఆలయ చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామంలో బుధవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల జాతర నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి మహిళలు నెత్తిన బోనాలు, శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుల్ల మధ్య ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు గట్టు మొగిలి, ఆకుల శ్రీనివాస్, నాయకులు తీగల శ్రీనివాస్, కనక య్య, రవి, జనార్దన్, శ్రీహరి, మోహన్, సత్తయ్య, బుర్ర పర్శ రాములు, రాజయ్య, ఎల్లయ్య, రమేశ్ పాల్గొన్నారు.

గంగిపల్లిలో ఎల్లమ్మ జాతర

మానకొండూర్: మండలంలోని గంగిపల్లిలో బుధవారం రేణుకా ఎల్లమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతరకు మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ తిరుపతి జాతరలో పాల్గొన్ని మొక్కులు చెలించారు.

ప్రజలు సంతోషంగా జీవించాలి

హుజూరాబాద్: బీరన్న ఆశీస్సులతో ప్రజలు సంతోషగా జీవించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. పట్టణంలో జరిగిన బీరన్న జాతరకు బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలతో తెలంగాణ సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షించారు. రానున్న వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల ముఖాల్లో ఆనందం చూడాలని వేడుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పండించే రైతులకే బోనస్ ఇస్తామనడం సరైనది కాదని, ఏ రకమైన వడ్లు పండించినా తప్పకుండా బోనస్ ఇవ్వాల, రూ. రెండు లక్షల రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా అగ్ని గుండాలు

చొప్పదండి: కురుమలు, యాదవుల ఆరాధ్య దైవం బీరప్ప మహంకాళి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని బీరయ్య ఆలయంలో బుధవారం నాగవెల్లి పట్నం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామరాతి, మహంకాళి, బీరప్ప వేషధారణలు ఆలరించారు. పెద్దపట్నమేసి బోనాలు సమర్పించారు. ఒగ్గు కళా బృందం సభ్యులు బీరప్ప కామరాతి కథను ప్రదర్శించారు. అనంతరం అగ్ని గుండాల కార్యక్రమం నిర్వహించగా కురుమ, యాదవ మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

కొండగట్టు భక్తుల పాదయాత్ర



చిగురుమామిడి మండలం ఇందుర్తిలో పోచమ్మ బోనాలతో ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు



చొప్పదండి: నాగవెల్లి పట్నం వేసి పూజలు చేస్తున్న ఒగ్గు పూజారులు

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి భక్తులు బుధవారం కొండగట్టు గ్రామం నుంచి పాదయాత్రగా బయటదేరారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్, రాజు, అజయ్, ఐలేశ్‌యాదవ్, ప్రశాంత్, అభిలాశ్ కొండగట్టుకు కాలినడకన చేరుకుని మొక్కులు చెల్లించుకోనున్నట్లు తెలిపారు.



హుజూరాబాద్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

మట్టి తవ్వకాలు ఆపాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

రామడుగు: మండలంలోని దేశరాజుపల్లి ఊర చెరువులో నుంచి మట్టిని రైల్వే కంట్రాక్టర్ ప్రొక్లెయిన్‌లతో తవిస్తుండటంతో ఉపాధిహామీ కూలీలకు పని దొరకడం లేదని గ్రామానికి చెందిన పలువురు బుధవారం కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. రెండు నెలలుగా ఇష్టం వచ్చినట్లు మట్టి తీస్తున్నారని, గ్రామ ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి గ్రామసభ నిర్వహించకుండా ఎన్‌ఓసీ ఇచ్చారని పేర్కొన్నారు. ఎన్‌ఓసీని ఆధారంగా కాంట్రాక్టర్ చెరువులో మట్టి తవ్వకాలు చేయడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తవ్వకాలను అడ్డుకుంటే కాంట్రాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. వెంటనే మట్టి తవ్వకాలు ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులను మోసం చేయొద్దు

- అన్నిరకాల వడ్లకు బోనస్ ప్రకటించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకే రూ.500 బోనస్ ప్రకటించడం సిగ్గుచేటని, రైతుల నుంచి వ్యతిరేకత తప్పదని, అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం ఆవరణలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని, సన్నరకం వరికి పెట్టుబడి అధికం, రోగాలతో పంట దిగుబడి తగ్గుతుందని దొడ్డురకం సాగుకు 80శాతం రైతులు మొగ్గు చూపుతారని అధికారిక గణాంకాలు చెపుతున్నా ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. రైతులను మోసం చేస్తే ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెబుతారని, గత ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం కోసం తీసుకున్న చెక్కులు వాపస్ ఇస్తామనడం సరికాదన్నారు. గొర్రెల యూనిట్లను మంజూరు చేయాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం, అధికార యాంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోన్ కార్యదర్శి శీలం అశోక్, సభ్యులు జక్కుల రమేశ్‌యాదవ్, నాయకులు మదునయ్య, మారెపల్లి కిరణ్, కొడారి సురేశ్, జక్కుల సాయిరాం, కల్లూరి శ్రీనివాస్, పుల్ల రజాక్, సురేశ్, చల్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులను తొలగించాలి

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో బెల్ట్‌షాపులను తొలగించాలని, అధిక రేటుకు మద్యం అమ్మకూడదని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపెల్లి మల్లేశం డిమాండ్ చేశారు. బుధవారం చిగురుమామిడిలో మాట్లాడారు. మండలంలోని 17 గ్రామాల్లోని బెల్ట్‌షాపులను రద్దుచేయాలని గత రెండు సర్వసభ్య సమావేశాల్లో నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశాం, అనంతరం ఏకగ్రీవ తీర్మానం చేసినా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్లకు అలవాటుపడి పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ మండలంలోని కొన్ని గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎంఆర్‌పీ కంటే అదనంగా డబ్బులు తీసుకుంటున్నారని, అధికారులు ఇప్పటికైనా బెల్ట్‌షాపులను రద్దుచేయాలని కోరారు. లేదంటే వైన్‌షాపుల ఎదుట ధర్నా, ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

హనుమాన్ మాలధారులకు భిక్ష



భోజనం వడ్డిస్తున్న ఆటోడ్రైవర్ సందాని

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామంలో ఆటోడ్రైవర్ మహమ్మద్ సందాని హనుమాన్ మాలధారులకు బుధవారం భిక్ష ఏర్పాటు చేసి, మతసామరస్యాన్ని చాటాడు. పేద కుటుంబానికి చెందిన వాడినే అయినా ఎనిమిదేళ్లుగా హనుమాన్ స్వాములకు భిక్ష ఏర్పాటు చేస్తున్నానని తెలిపాడు. ఆంజనేయస్వామి ఆశీస్సులతో తన కుటుంబం ఆరోగ్యంగా ఉంటోందన్నాడు. శ్రీఅపర్ణ సోమేశ్వరస్వామి ఆలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజల అనంతరం పాఠశాల మైదానంలో సుమారు 100 మంది హనుమాన్ భక్తులకు తాను స్వయంగా భోజనం వడ్డించినట్లు పేర్కొన్నాడు. ఈ సందర్భంగా అతన్ని గ్రామస్తులు అభినందించారు.



'కెనాన్' వర్క్‌షాప్

జమ్మికుంట: పట్టణంలో ఫొటో, వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఫొటోగ్రఫీలో నైపుణ్యంపై బుధవారం కెనాన్ వర్క్‌షాప్ కార్యక్రమం నిర్వహించారు. కెనాన్ వర్క్‌షాప్ మెంటర్ ధనిషెట్టి రాంబాబు, కెనాన్ కంపెనీ ప్రతినిధి విష్ణురెడ్డి, కరీంనగర్ జిల్లా అసోసియేషన్ సభ్యులు రవి, ఆకాశ్ ఫొటోగ్రఫీ టెక్నాలజీ శిక్షణ అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి తిరుపతి, గౌరవ అధ్యక్షుడు శివన్న, రాంబాబు, శ్రీధర్, అజార్, మోరె జాన్, సందీప్, రవి పాల్గొన్నారు.

చిగురుమామిడి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం





అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి కరుణాకర్

చిగురుమామిడి: చిగురుమామిడి మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. చిగురుమామిడి డార్విన్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో సభ్యులు అధ్యక్షుడిగా చిట్టంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఎనగందుల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా రాకం కరుణాకర్, సంయుక్త కార్యదర్శులుగా పత్తేం రమేశ్, మారుపాక రమేశ్, కోశాధికారిగా తాల్ల నరేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు గుడికందుల దేవదాసు, బోయిని సంపత్, రాకం అనిల్, ఆకుల రాజు, వేల్పుల క్రాంతికుమార్, జీడీ నగేశ్, ముంజ శ్రీకాంత్, బొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ల కోసం కూలీల పడిగాపులు



శంకరపట్నం: మండలంలోని గద్దపాకలో చెరువు మట్టిని పంటపొలాలకు తరలిస్తుండగా బుధవారం కూలీలు ట్రాక్టర్ల కోసం పడిగాపులు కాశారు. చెరువులోని మట్టిని తీసేందుకు సుమారు 150 మంది కూలీలు పనులకు హాజరయ్యారు. కూలీలకు సరిపడా ట్రాక్టర్లను సమకూర్చ లేదు కేవలం నాలుగు ట్రాక్టర్ల ద్వారా మట్టిని సరఫరా చేయడంతో కూలీలు ట్రాక్టర్ల కోసం ఎండలో వేచి చూశారు. చెరువులో నీడ వసతి కల్పించక పోవడంతో ఇబ్బందికి గురయ్యామని, కూలీ గిట్టుబాటు కావడంలేదని మహిళలు ఆరోపించారు.



మానకొండూర్ మండలం ముంజంపల్లి గ్రామంలో బుధవారం ఎల్లమ్మతల్లి జాతర సందర్భంగా గౌడ సంఘం సభ్యులు ఒకే తాటి చెట్టుపై నుంచి కల్లుగీసి అమ్మవారికి తీర్థ ప్రసాదం సమర్పించారు. - మానకొండూర్

ప్రభుత్వాసుపత్రి సేవలు వినియోగించుకోవాలి



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ కృష్ణప్రసాద్

హుజూరాబాద్: ప్రభుత్వాసుపత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీహెచ్‌ఎస్ కృష్ణప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని బుధవారం సందర్శించారు. ఆసుపత్రిలోని డయాలసిస్, ల్యాబ్, ఫార్మసీ, లేబర్, క్యాజువాలిటీ, పలు విభాగాలు, వార్డులను పరిశీలించారు. ఆసుపత్రి ఏఓ డాక్టర్ నారాయణ్‌రెడ్డి, డాక్టర్ సోమశేఖర్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... ఆసుపత్రిలో అన్నిరకాల శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని, వైద్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటున్నారని, రోగుల పరిస్థితిని బట్టి సాధ్యమైనంత వరకు ఇక్కడే చికిత్స అందిస్తున్నారని, తప్పని పరిస్థితిల్లోనే నిబంధనల ప్రకారం వరంగల్ ఎంజీఎం, కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారని అన్నారు. వైద్యులు ఆసుపత్రికి గైర్హాజరయితే శాఖా పరమైన చర్యలు తప్పవని, ఆసుపత్రికి కేటాయించిన అన్ని టార్గెట్‌లు పూర్తి చేశారని, వైద్యులు, సిబ్బంది అంకితభావంతో విధులను నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. వెంట డీఎం ముజామిల్ ఖాన్, వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేల యాజమాన్యంపై అవగాహన సదస్సు



వర్మీకల్చర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

చొప్పదండి: మండలంలోని కోనేరుపల్లి గ్రామంలో సుస్థిర నేల యాజమాన్యంపై బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఎల్ఎం ప్రాజెక్ట్ మేనేజర్ టి. సతీశ్‌కుమార్ హాజరై మాట్లాడారు. చెరువు, నది పరివాహక ప్రాంతాల్లో అధిక వర్షం కురిసినప్పుడు నేల కోతకు గురై నేలలో ఉన్న పోషకాలు కొట్టుకు పోతాయని, నేల కోతను తగ్గించేందుకు వాలుకు అడ్డంగా గట్లపై చెట్లను పెంచితే నేలకోతను నివారించవచ్చన్నారు. నేలలో సేంద్రీయ కర్బనం పెంచటానికి పునరుత్పాదక వ్యవసాయ పద్ధతులు పాటించాలని సూచించారు. అనంతరం వర్మీ కల్చర్‌ను గ్రామ పంచాయతీ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ అధికారి విష్ణు, నిఖిత, ఫీల్డ్ ఆఫీసర్ చంద్ర లీల, పంచాయతీ సెక్రటరీ ఉమారాణి, కారోబార్ రాజనర్సయ్య పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

జమ్మికుంట: అంతర్జాతీయ కరాటే పోటీల్లో భాగంగా ఈ నెల 19న గోవాలోని మనోహర్ పారికర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో నాలుగు దేశాల నుంచి మాస్టర్స్, 1500 మంది స్టూడెంట్స్ పాల్గొన్నారు. అండర్ 14 విభాగంలో జమ్మికుంటకు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. పట్టణంలోని కొత్తపల్లికి చెందిన ఎండీ లిబాన్ బ్రౌన్ బెల్ట్, టీమ్ కటాస్‌లో బంగారు పతకం, స్పారింగ్‌లో కాంస్య, కటాస్‌లో రజితం, జి.ధరణేశ్ పర్పుల్ బెల్ట్, టీమ్ కటాస్‌లో బంగారు, కాంస్య పతకం, జి.కార్తీక్ పర్పుల్ బెల్ట్ అండర్ 10 విభాగంలో టీమ్ కటాస్‌లో బంగారు, కాంస్య పతకం సాధించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సినీ హీరో సుమన్ చేతుల మీదుగా పతకాలు, కరాటే మాస్టర్ ఎండీ మహమూద్‌ను ప్రశంసిస్తూ టీమ్ చాంపియన్ ట్రోఫీ అందజేశారు.

మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలి

కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన మహిళలకు నెలకు రూ.2,500లు ఇవ్వాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని కోతిరాంపూర్‌లో గల ముకుందలాల్ మిశ్రాభవన్‌లో జరిగిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత ప్రజావ్యతిరేక బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దెదించారని, కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మి అధికారం కట్టబెట్టారని అన్నారు. జిల్లావ్యాప్తంగా మండల కమిటీలు, గ్రామ కమిటీలు వేసి మహిళా సంఘాన్ని బలోపేతం చేస్తామని, మహిళా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఉపాధి హామీ పనిలో ఎక్కువగా మహిళలే పాల్గొంటున్నారని, వారికి నీడ సౌకర్యం, కనీస వేతనాలు, రోజుకు రూ.600లు వచ్చే విధంగా కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాదాసు యమున, చేని రోజా, ఎం. రమ, స్వరూప, అరుణ తదితరులు పాల్గొన్నారు.

25న హెచ్‌ఆర్‌సీఐ సభ

కరీంనగర్‌రూరల్: ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంలోని సింహాచలం ఎస్ఆర్ కల్యాణ మండపంలో 25న హ్యూమన్ రైట్స్ ఫర్ ఇండియా (హెచ్‌ఆర్‌సీఐ) ద్వితీయ వార్షికోత్సవ సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తిరుమల్ రావు, అధికార ప్రతినిధి అంజయ్య, పీఆర్‌వో రాజేశం తెలిపారు.